ఇష్టారాజ్యంగా
స్టాంపు పేపర్ల విక్రయాలు

వెండర్లపై కొరవడిన పర్యవేక్షణ



వనపర్తి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే: జిల్లాలో స్టాంపు పేపర్ల విక్రయదారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. విలువ కంటే అదనంగా వసూలు చేస్తూ వెండర్లు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. తప్పని పరిస్థితుల్లో కొనుగోలుదారులు అడిగిన మొత్తాన్ని ఇవ్వక తప్పడం లేదు. వనపర్తి, ఆత్మకూరులో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలుండగా వీటి పరిధిలో 29 మంది అనుమతి పొందిన వెండర్లున్నారు. జ్యుడీషియల్ స్టాంపులతోపాటు ఫ్రాంకింగ్ యంత్రాల ద్వారా నిత్యం సుమారు 5వేల వరకు వివిధ రకాల స్టాంపులు విక్రయిస్తుండగా ఆ శాఖకు రూ.5 లక్షల వరకు ఆదాయం సమకూరుతుంది. రూ.10 విలువ చేసే స్టాంప్ పేపర్‌ను ప్రభుత్వం రద్దు చేయగా రెండేళ్ల నుంచి రూ.20 స్టాంపు పేపర్లు కూడా రావడం లేదు. ప్రస్తుతం వెండర్ల వద్ద రూ.50, రూ.100 స్టాంపు పేపర్లున్నాయి. వీటి విక్రయాలపై ప్రభుత్వం 5 శాతం కమీషన్ ఇస్తోంది. వెండర్లు మాత్రం రూ.50 స్టాంపు పేపర్‌ను రూ.80, రూ.100 స్టాంపు పేపర్‌ను రూ.150కి విక్రయిస్తున్నారు. అడిగిన మొత్తం ఇవ్వకుంటే స్టాక్ లేవని చెబుతున్నారు.

ఆన్‌లైన్ విధానం అమలులో ఉన్నా..: స్టాంపు కొరత, నకిలీ స్టాంపుల విక్రయం ట్యాంపరింగ్ వంటి సమస్యలకు, అక్రమాలకు చెక్ పడేలా ప్రభుత్వం గతేడాది నుంచి ఆన్‌లైన్ విధానాన్ని అమలులోకి తెచ్చింది. గతంలో స్టాంపులపై పాత తేదీలు వేసి విక్రయించడం వంటి మోసాలు జరిగేవి. కొనుగోలుదారుల అవసరాన్ని బట్టి అధిక మొత్తంలో వసూలు చేసేవారు. వెండర్లు రోజూ ఎన్ని స్టాంపులు విక్రయించారని కచ్చితమైన లెక్క ఉండేది కాదు. వీటిని నియంత్రించేందుకు ప్రభుత్వం ఆన్‌లైన్ విధానాన్ని ప్రవేశపెట్టింది. కొనుగోలుదారుల వివరాలు, వెండర్లు ఏ రోజు ఎన్ని స్టాంపు పేపర్లు విక్రయించారనే పూర్తి వివరాలన్నీ అంతర్జాలంలో నిక్షిప్తమవుతున్నాయి. ఈ విధానం వల్ల అక్రమాలకు తావుండదని అధికారులు చెబుతున్నారు. అదనపు వసూళ్లకు అడ్డుకట్ట పడకపోవడం గమనార్హం.

అమలుకు నోచుకోని నిబంధనలు

నిబంధనల ప్రకారం స్టాంపు పేపర్‌ను నిర్దేశించిన ధరకే విక్రయించాలి. అదనంగా వసూలు చేయవద్దని నిబంధనలున్నా అమలుకు నోచుకోవడం లేదు. ఇదంతా సబ్ రిజిస్ట్రార్‌లకు తెలిసినా పట్టించుకోవడం లేదని బాధితులు ఆరోపిస్తున్నారు. సిబ్బంది కొరత ఉండటం వల్ల పేపర్లను వెండర్లకు పంపిస్తున్నారని తెలుస్తోంది. కేవలం రూ.50 స్టాంపు పేపర్లు విక్రయిస్తున్నారు. ఇక్కడ 100 స్టాంపు దొరక్కపోవడంతో కొత్తకోట, మహబూబ్‌నగర్ ప్రాంతాలకు వెళ్లి కొనుగోలు చేస్తున్నారు.

● స్టాంపు పేపర్ల విక్రయాలకు డబ్బులను ఆన్‌లైన్‌లో మాత్రమే చెల్లించాలి. అదనంగా డబ్బులిచ్చే ప్రసక్తే లేదు. వెండర్లకు స్టాంపు పేపర్ల విక్రయానికి ఐదు శాతం ప్రభుత్వం కమీషన్ ఇస్తోంది. అదనంగా డబ్బులివ్వాలని అడిగిన వెండర్లపై ఫిర్యాదు చేస్తే విచారణ చేసి చర్యలు తీసుకుంటాం. అదనంగా వసూలు చేశారని తేలితే లైసెన్సు రద్దు చేస్తాం. **-చంద్రశేఖర్‌రెడ్డి, సబ్‌రిజిస్ట్రార్ వనపర్తి**

స్కందమాతదేవిగా జోగులాంబ



విగ్రహాన్ని ప్రత్యేక రథంలో తీసుకువచ్చి కొలువు పూజ కార్యక్రమాలు పూర్తిచేశారు. కార్యక్రమంలో ఈవో పురేందర్, అర్చకులు పాల్గొన్నారు.

అలంపూర్, న్యూస్‌టుడే : అయిదో శక్తి పీఠమైన జోగులాంబ సన్నిధిలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. సోమవారం జోగులాంబ దేవి స్కందమాత రూపంలో దర్శనమిచ్చారు. ఆలయ సన్నిధిలో అభిషేకం, స్వర్ణ దర్శనం, కుంకుమార్చనలు, యాగశాలలో చండీహోమం నిర్వహించారు. అంతకుముందు జోగులాంబ ఉత్సవ

సీడీసీ అధ్యక్షుడిగా చంద్రశేఖర్‌రెడ్డి

కొత్తకోట గ్రామీణం: మండలంలోని కృష్ణవేణి చక్కెర కర్మగారం చెరకు అభివృద్ధి మండలి అధ్యక్షుడిగా కొత్తకోట పురపాలికకు చెందిన పాపయ్యగారి చంద్రశేఖర్‌రెడ్డిని నియమిస్తూ సోమవారం హైదరాబాద్ డైరెక్టర్ ఆఫ్ కేన్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. చంద్రశేఖర్‌రెడ్డి మూడేళ్లపాటు లేదా తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు ఈ పదవిలో కొనసాగుతారని పేర్కొన్నారు. సీడీసీ ఛైర్మన్‌గా ఎంపికైన చంద్రశేఖర్‌రెడ్డిని పలువురు అభినందించారు.



వద్దన్నా.. అంటగట్టారు!

● ట్రాక్టర్లు, వ్యవసాయ పరికరాలు బలవంతంగా అందజేత
● వాయిదాలు కట్టలేని దుస్థితిలో మహిళా సమాఖ్యలు

వనపర్తి జిల్లా కొత్తకోట మండల మహిళా సమాఖ్య రెండు ట్రాక్టర్లు, రొటవేటర్, నాటు వేసే యంత్రం, నాగలి, ఇతర వ్యవసాయ పనిముట్లను రూ.20.23 లక్షలతో బ్యాంకు రుణం ద్వారా తీసుకున్నారు. ప్రతి నెల రూ.50,500 వాయిదా చెల్లించాలి. ప్రస్తుతం మినీ ట్రాక్టర్‌ను ఓ రైతుకు అద్దెకివ్వగా నెలకు రూ.5వేలు ఇస్తారు. మిగతా రూ.45,500 కలిపి వాయిదా చెల్లించాలి. ఈ మండల సమాఖ్య స్త్రీ నిధి ద్వారా బ్యాంకులో రూ.కోటి డిపాజిట్ చేసింది. దానికి నెలకు రూ.54 వేల వడ్డీ వస్తోంది. ప్రస్తుతం వడ్డీ డబ్బులను వాయిదాలకు చెల్లించాల్సి వస్తోంది. సమాఖ్య నిర్వహణ భారంగా మారుతోంది.

మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండల సమాఖ్యకు ఈ ఏడాది ప్రారంభంలో రూ.13.32 లక్షలతో ట్రాక్టర్, రొటవేటర్, ట్రాలీ తీసుకున్నారు. డీఆర్‌డీఏ నుంచి తప్పనిసరిగా తీసుకోవాలని ఒత్తిడి చేయడంతో ట్రాక్టర్, ఇతర పనిముట్లను తీసుకొచ్చి మండల సమాఖ్య భవనం వద్ద పెట్టారు. వీటికి నెలకు రూ.20 వేలు వాయిదా కట్టాలి. వరుసగా మూడు నెలలు మండల సమాఖ్య డబ్బుల ద్వారా ఈఎంఐలు చెల్లించారు. డబ్బు లేక గత నాలుగు నెలలుగా వాయిదాలు చెల్లించడం లేదు.



కొత్తకోట మండల సమాఖ్యకు అందించిన ట్రాక్టర్లు

ఈనాడు, మహబూబ్‌నగర్ - న్యూస్‌టుడే, కొత్తకోట గ్రామీణం: పాలమూరులో మండల మహిళా సమాఖ్యలకు డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఇచ్చిన ట్రాక్టర్లు, ఇతర వ్యవసాయ పనిముట్లు పెనుభారంగా పరిణమిస్తున్నాయి. పలు సమాఖ్యలు ఈ రుణాలకు వాయిదాలు కట్టలేని పరిస్థితుల్లో ఉన్నాయి. ట్రాక్టర్లు, వ్యవసాయ పనిముట్లు వద్దని వారించిన వినకుండా బలవంతంగా అంటగట్టారు. వీటిలో చాలా వరకు వృథాగా పడి ఉండటంతో వీటి భారం సమాఖ్యలపై పడింది. దీంతో మహిళా సంఘాలకు ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ఉమ్మడి జిల్లాలో 77 మండలాలుండగా 60 మండలాలకు డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో వ్యవసాయ ట్రాక్టర్లు, పరికరాలను అందజేశారు.

రైతులకు వీటిని అద్దెకిస్తూ ఆర్థికంగా బలోపేతం కావాలనే ఉద్దేశంతో రుణాల ద్వారా వీటిని మహిళా సమాఖ్యలకు ఇచ్చారు. జాతీయ జీవనోపాధి మిషన్(ఎన్ఆర్ఎల్ఎం) కింద 25 శాతం గ్రాంట్‌తో రుణాలు పొంది వీటి ద్వారా లబ్ధి పొందాలనేది ఉద్దేశం. నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజీపేటలో పైలట్ ప్రాజెక్టు కింద దీనిని ప్రారంభించారు. ఇక్కడ 100 శాతం గ్రాంట్‌తో ట్రాక్టర్, ఇతర వ్యవసాయ పరికరాలు అందించినా ప్రస్తుతం నిరుపయోగంగా ఉన్నాయి. తర్వాత అన్ని మండల సమాఖ్యలకు ఈ పథకాన్ని అమలు చేయాలని అధికారులు భావించారు. వీటి కోసం రుణాలు తీసుకోవాలని ఒత్తిడి తెచ్చారు. గత మూడేళ్లుగా బ్యాంకుల ద్వారా రూ.10-25 లక్షల వరకు రుణాలు ఇప్పించి మహిళా సమాఖ్యలకు బలవంతంగా అంటగట్టారు. ప్రస్తుతం చాలా సమాఖ్యలు ఈఎంఐలు కట్టలేక ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్నారు. మరికొన్ని చోట్ల స్త్రీనిధిలో డిపాజిట్ చేసిన డబ్బులతో వచ్చిన వడ్డీలను చెల్లిస్తున్నారు. ఇటీవల వనపర్తి జిల్లాలో ఓ మండల సమాఖ్య వాయిదాలు కట్టలేక వీటిని విక్రయించాలని తీర్మానం చేసినట్లు సమాచారం.

సాధ్యం కాదన్నా...: ప్రస్తుతం గ్రామాల్లో చాలామంది రైతుల వద్ద ట్రాక్టర్లున్నాయి. చిన్న, సన్నకారు రైతులకు స్థానికంగా ఉండేవారే ట్రాక్టర్లు దున్నుకోవడానికి అద్దెకిస్తూ పంట చేతికొచ్చిన తర్వాతే డబ్బు తీసుకుంటున్నారు. మహిళా సమాఖ్యకు మాత్రం నగదు వెంటనే చెల్లించాలి. డీజిల్, డ్రైవర్, నిర్వహణ కోసం ప్రత్యేకంగా వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలి. ఇవన్నీ సాధ్యం కాదని మండల సమాఖ్యలకు తెలిసే రుణాలు వద్దన్నా తమకు అందించారని పలువురు మహిళలు వాపోతున్నారు. దీనిపై స్త్రీనిధి వనపర్తి డీపీఎం రాము, నాగర్‌కర్నూల్ డీపీఎం సుధాకర్ మాట్లాడుతూ కొన్నిచోట్ల అనుకున్న స్థాయిలో వీటికి అద్దె రావడంలేదన్నారు.

వడ్డీ డబ్బులు చెల్లిస్తున్నాం: ప్రతి గ్రామంలో 10 సంఖ్యలో ట్రాక్టర్లున్నాయి. మా సమాఖ్య ట్రాక్టర్లను అద్దెకు తీసుకునే పరిస్థితిలో లేరు. ప్రతినెల ఈఎంఐలు కట్టడానికి డబ్బులు లేక స్త్రీనిధి ద్వారా వచ్చే వడ్డీ నగదు చెల్లిస్తున్నాం. ఈ సమస్యపై ఉన్నతాధికారులు దృష్టి సారించి పరిష్కారం చూపాలి.
-ప్రసన్నరాణి, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు, కొత్తకోట

ప్రజావాణి వినతులకు ప్రాధాన్యమివ్వండి



ప్రజావాణిలో ఫిర్యాదులను పరిశీలిస్తున్న కలెక్టర్ ఆదర్శ్‌సురభి, అదనపు కలెక్టర్లు నగేశ్, సంచిత్‌గంగ్వార్

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే: కలెక్టరేట్ ప్రజావాణి ఫిర్యాదులతోపాటు సీఎం కార్యాలయం, జిల్లా మంత్రి నుంచి వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ ఆదర్శ్‌సురభి అన్నారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయ సమావేశం మందిరంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్లు నగేశ్, సంచిత్‌గంగ్వార్‌లు బాధితుల నుంచి ఆర్జీలు స్వీకరించి బాధితులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి ఆర్జీలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరించాలన్నారు. రెవెన్యూ విభాగంలో అత్యధికంగా ఫిర్యాదులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ప్రజావాణికి 70 ఫిర్యాదులు వచ్చాయి. చేనేత కార్మికులను పోత్సహించేందుకు ప్రతి సోమవారం అధికారులు చేనేత వస్త్రాలను ధరించాలన్నారు.

ఒకే వార్డులో ఓటు ఉండేలా చూడాలి

మా గ్రామంలో కొందరు రాజకీయాల కోసం ఓటరు జాబితాను తారుమారు చేయడంతో గందరగోళంగా మారింది. ఇల్లున్నది ఒక చోట, ఓటు మరో చోట ఉందని ఇలా ఉండటం వల్ల ఓటర్లు ఇబ్బందులు పడే అవకాశముందన్నారు. ఒకే ఇంటిలోని ఓటర్లను ఒకే వార్డులో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. ఓటరు జాబితాను తారుమారు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి.
- ప్రతాపరెడ్డి, గోవిందునాయుడు, ఈశ్వరయ్యసాగర్, పామాపురం, కొత్తకోట

డబ్బు చెల్లించినా రుణమాఫీ కాలేదు

బ్యాంకులో రూ.2 లక్షలకు పైగా రుణం ఉంటే చెల్లించాం. రూ.2 లక్షల లోపు ఉన్న వారికి రుణమాఫీ వర్తిస్తుందని అధికారులు, ప్రజా ప్రతినిధులు చెప్పడంతో బ్యాంకులో రూ.2 లక్షల రుణం ఉండేలా మిగతా రుణాన్ని చెల్లించాం. ఈ డబ్బులను చెల్లించి రెండు నెలలు కావస్తున్నా ఇంత మాఫీ కాలేదు. అధికారులు స్పందించి రూ.2లక్షల లోపు రుణాలను మాఫీ చేయాలి. **-మాసన్న, సత్యన్న, దుప్పల్లి, వనపర్తి**

భూమిని సర్వే చేయాలి

మాకు సర్వే నంబరు 43లో ఖాస్ర, ఆర్వోఆర్‌లో 13 ఎకరాల 25 గుంటల భూమి ఉంది. ఇటీవల ధరణిలో 25 ఎకరాల 10 గుంటలు భూమి ఉన్నట్లు దస్త్రంలో అధికారులు చూపిస్తున్నారు. దీని వల్ల మాకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశముంది. భూమిని సర్వే చేసి సమస్యను పరిష్కరించాలని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు. భూమిని సర్వే చేసి సమస్యను పరిష్కరించాలి. **-బాలవర్ధన్, రంగాపూర్, అమరచింత**

సర్కారు బడులకు కొత్త ఉపాధ్యాయులు

● మెరుగు పడనున్న విద్యా ప్రమాణాలు
● 9న సీఎం చేతుల మీదుగా నియామక పత్రాలు



అచ్చంపేట, న్యూస్‌టుడే : దసరా సెలవుల తరువాత సర్కారు బడులకు కొత్త ఉపాధ్యాయులు రానున్నారు. ఉపాధ్యాయుల నియామకం కోసం నిర్వహించిన డీఎస్సీలో అర్హత సాధించిన అభ్యర్థులను 1:3 నిష్పత్తిలో ఎంపిక చేసి ధ్రువపత్రాల పరిశీలన పూర్తి చేశారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న 1,077 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసేందుకు 1:1 నిష్పత్తిలో తుది జాబితాను రూపొందించడంలో అధికారులు నిమగ్నమయ్యారు. మంగళవారం తుది జాబితాను ప్రకటించి వారికి ఈ నెల 9న హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఈ ఏడాది జూన్‌లో నిర్వహించిన ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులతో చాలా వరకు ఖాళీలు ఏర్పడ్డాయి. ఉమ్మడి జిల్లాలో సుమారు 2 వేల మంది ఎస్‌జీటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించడంతో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో చాలా వరకు ఉపాధ్యాయ ఖాళీలు ఏర్పడ్డాయి. ప్రస్తుతం డీఎస్సీ నియామకాలతో చాలా వరకు సమస్య పరిష్కారం కానుంది.


ఉమ్మడి జిల్లాలో భర్తీ కానున్న ఖాళీలు

జిల్లా	ఉపాధ్యాయ ఖాళీలు
గద్వాల	172
మహబూబ్‌నగర్	243
నాగర్‌కర్నూలు	231
నారాయణపేట	279
వనపర్తి	152

ఆర్టీసీ బస్సులు ఏర్పాటు : డీఎస్సీలో ప్రతిభను చాటి ఉపాధ్యాయులుగా ఎంపికైన అభ్యర్థులను ఈ నెల 9న హైదరాబాద్‌కు తరలించేందుకు ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. డీఈవోల ఆధ్వర్యంలో ఉపాధ్యాయ అభ్యర్థులను ప్రత్యేక బస్సుల్లో హైదరాబాద్ తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. సీఎం చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేసేందుకు ఎంపికైన వారికి గుర్తింపు కార్డులు జారీ చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అభ్యర్థులను సమావేశ స్థలానికి తరలించేందుకు అవసరమైన ఆర్టీసీ బస్సులు జిల్లాల వారీగా ఏర్పాటు చేసి మధ్యాహ్నం 2 గంటల వరకు ఎల్‌బీ స్టేడియానికి చేరుకునేలా ప్రణాళికలు రూపొందించారు. తుది జాబితాను 8న ప్రకటించి ఎంపికైన వారిని 9న హైదరాబాద్ సీఎం సభకు తీసుకెళ్లనున్నామని డీఈవో డా. గోవిందరాజులు తెలిపారు.



గణితంలో ప్రతిభ : డీఎస్సీలో గణితం స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యేందుకు నిర్వహించిన డీఎస్సీలో 72.27 స్కోరు సాధించాను. వనపర్తి జిల్లా పరిధిలో ఎస్ఏ (గణితం) లో రెండో ర్యాంకు సాధించాను. డీఈవో కార్యాలయంలో నిర్వహించిన ధ్రువపత్రాల పరిశీలనకు హాజరయ్యారు. తుది జాబితాలో అవకాశం దక్కించుకొని గణితం ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహించేందుకు సిద్ధమవుతున్నా. సర్కారు బడుల్లో చదువుకొని ఉపాధ్యాయ వృత్తిలో అడుగు పెడుతున్నందున పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేస్తా. **- గౌతంకుమార్, కడుకుంట్ల, (వనపర్తి)**



పీడీగా అవకాశం : ఇప్పటికే వ్యాయామ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నా. 2017లో గురుకుల, 2018 టీఆర్టీలో, 2021లో నవోదయ విద్యాలయ సమితి నిర్వహించిన పీఈటీ పరీక్షలో ప్రతిభను చాటి ఉపాధ్యాయ వృత్తిలో చేరాను. ప్రస్తుతం నిర్వహించిన డీఎస్సీలో స్కూల్ అసిస్టెంట్ (వ్యాయామ ఉపాధ్యాయుడు)గా నియామకం కోసం నిర్వహించిన పరీక్షలో నాగర్‌కర్నూలు జిల్లాలో మొదటి ర్యాంకు సాధించాను. విద్యార్థులను ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తాను. **- నేణావత్ జానునాయక్, చేదురుబావి తండా (అచ్చంపేట)**

ప్రమాదకరంగా గన్యా

ఉమ్మడి జిల్లా నుంచి పుణెకు రక్త నమునాలు

న్యూస్‌టుడే, పాలమూరు



మహబూబ్‌నగర్ : తిమ్మాసానిపల్లిలో వివరాలు తెలుసుకుంటున్న జిల్లా మలేరియా నివారణ అధికారి డా.శశికాంత్

మహబూబ్‌నగర్‌కు చెందిన ఓ నేతకు గత నెల 7న జ్వరం రాగా రక్త పరీక్షలు చేయించుకున్నారు. టైఫాయిడ్‌తో పాటు గన్యా పాజిటివ్‌గా ఫలితం వచ్చింది. 15 రోజుల క్రితం పరీక్ష చేయించుకుంటే నెగిటివ్ వచ్చింది. అయినా మోకాళ్లు, చేతులు, పాదాలు, కీళ్లల్లో నొప్పి మాత్రం తగ్గలేదు. ఇప్పటికీ మరో వ్యక్తి సహాయంతోనే నడుస్తూ పనులు చేసుకోవాల్సి వస్తోంది. ఇలా ఉమ్మడి జిల్లాలోని చాలా మంది గన్యాతో బాధపడుతున్నారు. పలువురు ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారు. ఉమ్మడి జిల్లాలో పరిస్థితిపై 'న్యూస్‌టుడే' కథనం.

గన్యా గతంలో 15, 20 రోజుల్లో పూర్తిగా తగ్గేది. ఇప్పుడు ఆ వ్యాధి నెల రోజులు దాటినా తగ్గడం లేదు. ఎడిస్ దోమ కాటే ఇందుకు కారణం. ఇది రాత్రి పూట కంటే పగటి పూట కుట్టిన వారికే ప్రమాదం ఎక్కువ. ఈ దోమ ద్వారా వచ్చే ఆల్ఫా వైరస్ రూపాంతరం చెందుతుండటంతో గన్యా త్వరగా తగ్గడం లేదు. రాష్ట్ర వ్యాప్తంగా ఇదే విధంగా ఉండటంతో అన్ని జిల్లాల నుంచి అనుమానితులు, బాధితుల నుంచి రక్త నమునాలను సేకరించి మహారాష్ట్రలోని పుణెలో ఉన్న ఎన్ఐవీ(నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ) ప్రయోగశాలకు పంపించాలని డీఎంహెచ్‌వోలకు ఆదేశాలు అందాయి. ఈ మేరకు అధికారులు వారం క్రితం నమునాలను సేకరించి వాటిని ప్రయోగశాలకు పంపించారు. నమూనాల నివేదికలు వచ్చాక వైరస్ తీవ్రత తెలుస్తుందని, దాన్ని బట్టి వైద్యులు చికిత్సను అందిస్తారని మహబూబ్‌నగర్ జిల్లా మలేరియా వ్యాధి నివారణ అధికారి డా. శశికాంత్ 'న్యూస్‌టుడే'కు వివరించారు.

ప్రతి జిల్లా నుంచి 10 నమునాలు : గన్యా తీవ్రతను తెలుసుకోవడానికి, మారుతున్న వైరస్ లక్షణాలను పసిగట్టడానికి ప్రతి జిల్లా నుంచి కనీసం 10 రక్త నమునాలు సేకరించారు. జ్వరంతో బాధపడుతున్నవారు, మోకాలు, పాదాలు, చేతులు, అరికాళ్లు తదితరాల వద్ద కీళ్ల నొప్పులతో ఇబ్బందులు పడుతున్న అనుమానితుల నుంచి రక్త నమునాలను నాలుగు జిల్లాల్లో తీసుకున్నారు. జోగులాంబ గద్వాల జిల్లాలో ఒక్క కేసు నమోదు కాకపోవడంతో అక్కడి నుంచి నమునాలను పంపించలేదు. ● మహబూబ్‌నగర్ జిల్లాలో జనవరి నుంచి ఇప్పటి వరకు 38 గన్యా కేసులు నమోదయ్యాయి. అనధికారంగా ఇంకా చాలా మంది బాధితులు ఈ వ్యాధితో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలోని మహబూబ్‌నగర్, భూత్పూర్, మిడ్జిల్, జడ్చర్ల తదితర పీహెచ్‌సీల పరిధిలోని గ్రామాల నుంచి 10 మంది అనుమానితుల నుంచి నమునాలను సేకరించారు.

● నాగర్‌కర్నూల్ జిల్లాలో పది నెలల నుంచి మూడు కేసులే నమోదయ్యాయి. పెద్దకొత్తపల్లి, నాగర్‌కర్నూల్, తెల్కపల్లి, బిజినేపల్లి, కల్వకుర్తి, తాడూరు తదితర ప్రాంతాల్లో జ్వరం, మోకాళ్ల నొప్పులతో బాధపడుతున్న 11 మంది నుంచి రక్త నమునాలను సేకరించారు.

● వనపర్తి జిల్లాలో 17 గన్యా కేసులు నమోదయ్యాయి. పెద్దమందడి, కడుకుంట్ల మండలాల్లో 10 మంది నుంచి రక్త నమునాలు సేకరించారు.

● నారాయణ పేట జిల్లాలో గన్యా కేసులు నమోదు కాలేదు. కోటకొండ, మద్దూర్, నారాయణపేట, దామరగిద్ద తదితర ప్రాంతాల్లో 19 మంది అనుమానితుల నుంచి రక్త నమునాలు సేకరించారు.

నిరంతరాయంగా జల విద్యుదుత్పత్తి

ఆత్మకూరు, న్యూస్‌టుడే: జూరాల ప్రాజెక్టు వద్ద 50 వేల వరద నీటి ఉద్ధృతి కొనసాగుతున్న క్రమంలో ఎగువ, దిగువ జల విద్యుత్తు ఉత్పత్తి కేంద్రాల్లో నిరంతరాయంగా విద్యుత్తు ఉత్పత్తి చేపడుతున్నారు. జల విద్యుత్తు ఉత్పత్తికి 39,519 క్యూసెక్కుల వరద నీటిని విడుదల చేస్తుండగా గడిచిన 24 గంటల్లో ఎగువన ఐదు యూనిట్ల ద్వారా 4.018, దిగువన ఆరు యూనిట్ల ద్వారా 4.408 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి జరిగింది. ప్రస్తుత వర్షాకాలం సోమవారం నాటికి విద్యుత్తు ఉత్పత్తి ఎగువన 241.654, దిగువన 218.147 మిలియన్ యూనిట్లుగా నమోదైనట్లు జెన్‌కో ఎస్ఈ (ఓఅండ్ఎం) సూరిబాబు తెలిపారు.



బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ రావుల గిరిధర్

ప్రజావాణి ఫిర్యాదులు తక్షణమే పరిష్కరించండి

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే: పోలీసు ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. సోమవారం ఎస్పీ కార్యాలయంలో ప్రజావాణి నిర్వహించారు. ప్రజావాణికి వచ్చిన బాధితులతో ఎస్పీ మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకొని పరిష్కారానికి భరోసానిచ్చారు. తొమ్మిది భూ ఫిర్యాదులు, ఒకటి కుటుంబ తగాదాల ఫిర్యాదు, ఏడు పరస్పర ఫిర్యాదులొచ్చాయి.

త్వరలో కొత్త రెవెన్యూ చట్టం

మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చిత్రంలో కల్వకుర్తి ఎమ్మెల్యే నారాయణరెడ్డి, కలెక్టర్ సంతోష్ తదితరులు

కల్వకుర్తి పట్టణం, న్యూస్‌టుడే : కొత్త రెవెన్యూ చట్టాన్ని త్వరలోనే అమల్లోకి తేబోతున్నామని, ప్రతి కుటుంబానికి స్మార్ట్‌కార్డులు జారీ చేసేందుకు పైలట్ ప్రాజెక్టు ప్రారంభించామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సోమవారం నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలో సుమారు రూ.43 కోట్లతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డితో కలిసి శంకుస్థాపనలు చేసి మాట్లాడారు. ఎన్నికల హామీల అమలుకు కట్టుబడి ఉన్నామని, రైతులు, నిరుద్యోగులు, ఆడపడచులు, బడుగులకు న్యాయం చేస్తామన్నారు. మార్పు కోసం ప్రజలు కాంగ్రెస్‌పార్టీకి అధికారం కట్టబెట్టారని రాష్ట్రంలో ఇందిరమ్మ పాలన తెస్తామన్నారు. అన్నదాతలకు ఇచ్చిన మాట ప్రకారం రూ.2 లక్షల రుణమాఫీకి రూ.31 వేల కోట్లు అవసరం ఉండగా ఇప్పటికే రూ.18 వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమచేశామన్నారు. ఎన్ని రూ.కోట్లయినా సరే ప్రతి రైతుకు రుణమాఫీ చేస్తామన్నారు. ప్రతి నియోజకవర్గంలో 4వేల ఇందిరమ్మ ఇళ్ల నిర్మించి ప్రతి పేదవాడికి సొంతింటి కల నెరవేరుస్తామన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 10 నెలల్లోనే 61వేల ఉద్యోగాలను భర్తీ చేశామని ఎన్ని ఒడిదొడుకులు ఎదురైనా సంక్షేమ పథకాలను అమలు చేసి తీరుతామన్నారు.

భారాస పాలనతోనే ఆర్థిక దుస్థితి / దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ



మాట్లాడుతున్న దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ఉమామహేశ్వరం ధర్మకర్తల బృందం

అచ్చంపేట న్యూటౌన్, న్యూస్‌టుడే : పదేళ్ల భారాస పాలనలో ఫాం హౌస్‌లకు పరిమితమైన నేతల నిర్వాకంతో రాష్ట్రాన్ని రూ. లక్షల కోట్ల అప్పుల కుప్పగా మార్చి ఆర్థిక మనుగడ లేకుండా చేశారని అటవీ, దేవాదాయ శాఖా మంత్రి కొండా సురేఖ విమర్శించారు. కేసీఆర్ నియంతృత్వ పోకడలతోనే రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్‌కు అధికారాన్ని కట్టబెట్టారన్నారు. సోమవారం నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలం శ్రీ ఉమామహేశ్వర క్షేత్రం ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆలయ ఛైర్మన్‌గా బీరం మాధవరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గజ్వేల్ నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా కేసీఆర్ సంతకాలు చేయక పోవడంతో వందల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు, మిషన్ భగీరథ వంటి పథకాలతో కోట్ల రూపాయల ప్రజాధనం దుర్వినియోగం చేశారన్నారు. భారాస పార్టీ ఖాతాలో రూ.1,500 కోట్లు ఎక్కడి నుంచి వచ్చాయో చెప్పాలన్నారు. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని, సీఎంగా రేవంత్ రెడ్డి రోజుకు 18 గంటల పాటు కష్టపడుతున్నారన్నారు. పదేళ్ల పాటు పరిష్కరించని రెండు పడక గదుల ఇళ్లు, కేజీ నుంచి పీజీ విద్య, ఇంటికో ఉద్యోగం, మూడెకరాల భూ పంపిణీ వంటివి అమలు చేయకుండానే సామాజిక మాధ్యమాల్లో కాంగ్రెస్ పాలనపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారన్నారు. ఈ నెల 6న 1,635 మందికి ఉద్యోగ నియామక పత్రాలను అందజేశామని, 9న ఉపాధ్యాయులకు నియామక పత్రాలను అందజేయనున్నామన్నారు. భారాస నేతలు సామాజిక మాధ్యమాల వేదికగా అభూత కల్పనలు సృష్టించి అబద్ధాలు ప్రచారం చేస్తున్నారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అధిక సీట్లతో సత్తా చాటాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ, ఎమ్మెల్సీ కూచుకుల్ల దామోదర్‌రెడ్డి, క్రీడా ప్రాధికార సంస్థ ఛైర్మన్ శివసేనారెడ్డి, ఆలయ ఈవో శ్రీనివాస్‌రావు, జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ రాజేందర్, నేతలు మోపతయ్య, మధుకర్‌రెడ్డి పాల్గొన్నారు.

సేవలో తరిస్తూ.. అనుభవం గడిస్తూ!

జనరల్ ఆసుపత్రిలో హౌస్ సర్జన్ శిక్షణ పొందుతున్న వైద్య విద్యార్థినులు





న్యూస్‌టుడే, పాలమూరు : మహబూబ్‌నగర్ ప్రభుత్వ వైద్య కళాశాల 2019 బ్యాచ్‌కు చెందిన 175 మంది ఎంబీబీఎస్ విద్యార్థులు ఆరు నెలల క్రితం థియరీ పరీక్షలు రాశారు. నాలుగున్నరేళ్ల నుంచి పుస్తకాలతో కుస్తీ పట్టిన వారు ఇప్పుడు హౌస్ సర్జన్ శిక్షణలో భాగంగా స్టెత్ పట్టి మహబూబ్‌నగర్ జనరల్ ఆసుపత్రిలో రోగులకు సేవలందిస్తున్నారు. జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, ఆర్థోపెడిక్స్, రేడియాలజీ, ప్రసూతి, ఈఎన్‌టీ, సైకియాట్రీ, చిన్నపిల్లలు, కన్ను, అనస్తీషియా, చర్మ తదితర 19 విభాగాల్లో రాత్రి పగలు అన్న తేడా లేకుండా విధులు నిర్వర్తిస్తున్నారు. కీలకమైన అత్యవసర విభాగంలో 12 మంది సేవలందిస్తున్నారు. ఈ నేపథ్యంలో పలువురిని 'న్యూస్‌టుడే' పలకరించింది. హౌస్ సర్జన్ శిక్షణ అనుభావాలు, అనుభూతులు వారి మాటల్లోనే..

ఆనందం.. ఆత్మవిశ్వాసం : తరగతి గదుల్లో నేర్చుకున్న వైద్యవిద్యను ఇప్పుడు ఆసుపత్రిలో ఉపయోగిస్తున్నాం. వివిధ సమస్యలతో వచ్చిన రోగులకు వైద్యసేవలు అందిస్తున్నాం. వారంతా వ్యాధులు నయమై ఆసుపత్రి నుంచి ఇంటికి వెళ్తుంటే చాలా ఆనందంగా ఉంటోంది. హౌస్ సర్జన్ శిక్షణతో నాలో ఆత్మవిశ్వాసం కూడా పెరిగింది. కొన్ని రోజుల తర్వాత ఎంబీబీఎస్ కోర్సు పూర్తవుతుంది. అనంతరం పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి కృషి చేస్తాను.

- భవానీ, సూర్యాపేట పట్టణం

ఆచార్యుల మార్గదర్శనంలో.. : రోగులు రకరకాల అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతూ జనరల్ ఆసుపత్రికి వస్తున్నారు. వారితో మాట్లాడి సమస్యలు తెలుసుకుంటున్నా. ఏయే కేసులకు ఎలాంటి చికిత్సలు అందించాలో శిక్షణ పొందుతున్నా. మా ఆచార్యుల సలహాలు, సూచనలతో ముందుకు సాగుతున్నా. ఇన్నాళ్లు పుస్తకాలు చదివి, తరగతులు వింటూ పొందిన జ్ఞానం ఉపయోగిస్తూ జనరల్ ఆసుపత్రికి వచ్చే పేదలకు వైద్య సేవలు అందించటం చాలా ఆనందంగా ఉంది.

- పావని, కర్నె(మక్తల్)



రోజు 50 కేసులు చూస్తున్నా.. : ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో రోజూ 50 వరకు ఐపీ కేసులను చూస్తున్నా. ఒక్కొక్కరు ఒక్కో సమస్యతో వస్తున్నారు. ముందుగా ప్రతి రోగి రిపోర్టులను చూసి వారి వ్యాధిపై ఒక అవగాహనకు వచ్చి చికిత్సలు అందిస్తున్నా. హౌస్ సర్జన్‌లో చాలా కొత్త విషయాలు తెలుస్తున్నాయి. రోగులకు నేరుగా వైద్య సేవలు అందించటం ఎంతో సంతృప్తిని ఇస్తోంది. అన్ని విభాగాల్లో విధులు నిర్వర్తిస్తూ సమగ్ర అవగాహన పెంచుకునేందుకు శిక్షణను సద్వినియోగం చేసుకుంటా.

- ఫరిసా, న్యూటౌన్, మహబూబ్‌నగర్



మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి అత్యవసర వైద్య విభాగంలో సేవలందిస్తున్న వైద్య విద్యార్థులు



అన్ని రకాల సమస్యలకు వైద్యం : చిన్నప్పటి నుంచి వైద్య విద్యంటే చాలా ఇష్టం. వైద్యురాలిని కావాలన్న పట్టుదలతో చదివాను. మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సీటు వచ్చింది. ప్రస్తుతం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఏడాది పాటు కొనసాగే హౌస్ సర్జన్ శిక్షణలో ఉన్నాను. ఇక్కడికి అనేక రకాల కేసులు వస్తున్నాయి. వారికి పరీక్షలు చేస్తూ వైద్యం అందిస్తున్నా. మంచి వైద్యురాలిగా స్థిరపడేందుకు ఎంతో ఉపయోగపడే ఈ శిక్షణ కాలాన్ని సద్వినియోగం చేసుకుంటా.

- ప్రవళిక, సూరాపూర్ (లింగాల)

నేడు మంత్రి రాక..

అలంపూర్, న్యూస్‌టుడే : అలంపూర్ ఆలయాల దర్శనానికి మంగళవారం దేవాదాయశాఖ మంత్రి కొండ సురేఖ రానున్నట్లు ఈవో పురేందర్ తెలిపారు. ఈనెల 9వ తేదీన నిర్వహించే కల్యాణోత్సవానికి ప్రభుత్వం తరుపున మంత్రి పట్టువస్త్రాలు అందజేస్తారు.

ఆలయ అభివృద్ధికి రూ.4లక్షల వితరణ

రాజోలి, న్యూస్‌టుడే : మండల కేంద్రంలోని అడివేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నంద్యాల పట్టణానికి చెందిన విశ్రాంత అధ్యాపకులు దొండపాటి రాజులు రూ.4 లక్షలు అందజేశారు. సోమవారం ఆలయం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆలయ కమిటీ సభ్యులకు ఈ నగదు అందించారు. ఆయన గతంలోనూ ఆలయ అభివృద్ధికి కొంత నగదును అందజేశారు. కార్యక్రమంలో నాగేశ్వర్‌రావ్, గోపాల్‌రెడ్డి, చంద్రశేఖర్‌గౌడ్, సర్వేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆలయ కమిటీ సభ్యులకు నగదు అందజేస్తున్న దాత

కూరగాయల పంట.. లాభాలు ఇంట

పాన్‌గల్, న్యూస్‌టుడే : కూరగాయలతో అధిక ఆదాయం పొందవచ్చని నిరూపిస్తున్నారు రైతు దంపతులు. ఐదేళ్లుగా సాగు చేపట్టి లాభాలు పొందుతున్నారు. పాన్‌గల్‌కు చెందిన కొత్త మోహన్‌రెడ్డి, కృష్ణవేణి దంపతులకు మూడెకరాల పొలం ఉంది. అరెకరంలో వరి సాగు చేపట్టి, మిగిలిన పొలంలో ఆకుకూరలు, కూరగాయలు పండిస్తున్నారు. ఏడాది పొడవునా వీటిని సాగు చేస్తూ నిత్యం ఆదాయం వచ్చేలా ప్రణాళికతో ముందుకు వెళ్తున్నారు. పంటను పొలం వద్ద, సంతలకు తీసుకెళ్లి అమ్ముతుంటారు. అవసరాన్ని బట్టి కూలీలను పిలిపించుకుంటారు. ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుని, వ్యవసాయశాఖ అధికారుల సూచనలు పాటిస్తూ ఆదాయం పొందుతున్నారు.

పంట సాగు ఇలా.. : ఆయిదేళ్ల క్రితం వీరు బిజినేపల్లిలో నివాసం ఉండేవారు. ఒకరి వద్ద పనిచేయడం కంటే సొంతంగా పని చేసుకోవాలని గ్రామానికి వచ్చారు. వరి సాగు చేపట్టి వాతావరణ మార్పులతో తెగుళ్ల నుంచి పంట రక్షించుకోవడానికి ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కూరగాయల సాగులో తక్షణమే నివారణ చర్యలు తీసుకోవడానికి అవకాశం ఉందని గుర్తించారు. స్థానికంగా ఎక్కువ మంది రైతులు కూరగాయలు పండించడాన్ని గమనించి సాగు చేపట్టారు. విత్తనాలు బిజినేపల్లి, కర్నూల్ నుంచి తెచ్చి నాటుతున్నారు. రెండున్నర ఎకరాల్లో ప్రతి పది గుంటల్లో ఒక రకం కూరగాయలను సాగు చేస్తుంటారు. చిక్కుడు, బెండ, వంకాయ, మిరప, కాకర, ఉల్లి, పాలకూర, మెంతి, కొత్తిమీర సాగు చేస్తున్నారు. ఉల్లి నారు ఇతర రైతులకు విక్రయిస్తుంటారు.



సాగుచేసిన చిక్కుడు



కలుపు నివారణకు గుంటక కొడుతున్న రైతు

ఏడాదికి రూ.3 లక్షలకు పైగా ఆదాయం: ఏడాదికి సుమారు రూ.2లక్షల వరకు ఖర్చు చేస్తున్నారు. ఖర్చులన్నీ పోగా రూ.3-4 లక్షల వరకు ఆదాయం వస్తోంది. పంటను బిజినేపల్లి నుంచి కావాలని దేండుకు వేప నూనె వినియోగిస్తూ ప్రధాన రహదారి వెంట పొలం ఉండటంతో రాకపోకలు సాగించే వారు తాజా కూరగాయలను కొనుగోలు చేస్తుంటారు. ఆదివారం వనపర్తి సంత, బుధవారం పాన్‌గల్, గురువారం కేతేపల్లి సంతకు కూరగాయలు తీసుకెళ్లి విక్రయిస్తాం. మాకు ఇద్దరు కుమార్తెలు సంతానం. ఒక అమ్మాయికి పెళ్లి చేశాం. మరో అమ్మాయిని కార్పొరేట్ కళాశాలలో ఇంటర్ చదివిస్తున్నాం. కూరగాయల సాగుతో కష్టానికి తగ్గ ఫలితం వస్తోంది. ఇటీవల కురిసిన వర్షాలకు మిరప తోటకు నష్టం వాటిల్లింది.

- కొత్త మోహన్‌రెడ్డి, పాన్‌గల్

యాసంగి మినుములో యాజమాన్య పద్ధతులు



మదనాపురం, న్యూస్‌టుడే : యాసంగి సీజన్‌లో సాగుచేసే మినుములో అధిక దిగుబడి సాధనకు తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలు, యాజమాన్య పద్ధతులపై మదనాపురం కృషి విజ్ఞాన కేంద్రం కీటక శాస్త్రవేత్త డాక్టర్ రాజేందర్ రెడ్డి రైతులకు సూచనలు అందించారు.

అనువైన రకాలు : పల్లాకు తెగులు తట్టుకునే పాలిష్ రకాలు సాగు చేసుకోవాలి. ఎల్‌బీజీ 752, 787, 645, 648, ఎంబీజీ 207, టీబీజీ 104, 129, జీబీజీ 1 అధిక దిగుబడినిచ్చే రకాలు. విత్తనాలు అక్టోబర్ నెల చివరి వరకు వేసుకోవచ్చు.

విత్తనశుద్ధి : కిలో విత్తనానికి 5 గ్రాముల ఇమిడాక్లోప్రిడ్ లేదా 5 గ్రాముల థయోమిథాక్సామ్ లేదా 5 మి.లీ మోనోక్రోటోఫాస్‌తో కలిపి విత్తనశుద్ధి చేయాలి. భూమి నుంచి సంక్రమించే వ్యాధుల నివారణకు కిలో విత్తనానికి థైరమ్ లేదా క్యాప్టాన్ లేదా మ్యాంకోజెబ్ లేదా కార్బండిజియం 2.5గ్రాములు లేదా ట్రైకోడర్మావిరిడి 8 గ్రాములు కలిపి విత్తాలి.

ఎరువుల యాజమాన్యం: చివరి దుక్కిలో ఎకరానికి 2 టన్నుల పశువుల ఎరువు వేసుకోవాలి. రైజోబియం కల్చర్‌ను 200 గ్రాముల పొడి విత్తనం చుట్టూ పొరల్లో ఉండేలా ఒక గంట ముందు విత్తనానికి పట్టించాలి. ఎకరానికి 2 కిలోల ఫాస్ఫోబాక్టీరియాను 200 కిలోల సేంద్రియ ఎరువుతో కలిపి దుక్కిలో లేదా విత్తనం వేసేటప్పుడు సాళ్లలో పడేటట్లు చూసుకోవాలి.

కలుపు నివారణ : విత్తిన వెంటనే లేదా మరుసటి రోజు ఎకరాకు పెండిమిథాలిన్ 30 శాతం 1.3-1.6 లీటర్లు 200 లీటర్ల నీటిలో కలిపి నేలపై పిచికారీ చేసుకోవాలి. విత్తనం వేసిన 20-25 రోజుల్లో ఎకరాకు ఇమాజిథపైర్ 300 మి.లీ. లేదా గడ్డిజాతి కలుపు మొక్కలు నివారణకు క్విజలోఫాప్ ఇథైల్ 400 మి.లీ లేదా ప్రోపాక్విజఫాప్ 10 శాతం 250 మి.లీ ఎకరానికి పిచికారీ చేసుకోవాలి.

చీడపీడల యాజమాన్యం: మినుము సాగులో చీడపీడలతో పంటకు నష్టం వాటిల్లుతుంది. రసంపీల్చే పురుగు, తెల్లదోమ, తామర పురుగుల నివారణకు 5శాతం వేపమందుతో మోనోక్రోటోఫాస్ 1.6మి.లీ లేదా ఎసిటామిఫిడ్ 0.3 గ్రాములు లేదా థైఫెనిథియోరాన్ ఒక గ్రాము లీటరు నీటిలో కలిపి పంట 20-25 రోజుల దశలో పిచికారీ చేయాలి. మారుక గూడు, పొగాకులద్దె పురుగు నివారణకు మొదటిదశలో క్లోరోపైరిఫాస్ 50ఈసీ 1.5మి.లీ లేదా ఎసిపేట్ 1.5 గ్రాములు, తర్వాత దశలో న్యూవులురాన్ 0.75మి.లీ లేదా ఫ్లూబెండమైడ్ 0.2మి.లీ లేదా క్లోరాంట్రానిలిప్రోల్ 0.3మి.లీ మందులను ఏదైనా లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

సాగులో.. సమస్యలా?

మదనాపురం : సాగులో యాజమాన్య పద్ధతులపై అన్నదాతలు ఆదివారం మినహా మిగతా రోజుల్లో ఉదయం 11 నుంచి 12 గంటల మధ్య చరవాణి నం : 94408 35658కి ఫోన్ చేస్తే సందేహాలను నివృత్తి చేస్తామని కేవీకే కీటక శాస్త్రవేత్త డాక్టర్ రాజేందర్‌రెడ్డి తెలిపారు.

రైతేరాజు

ప్రశ్నలు - సమాధానాలు

? వరిలో ఆకుముడత పురుగు నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోవాలి?

- వెంకటయ్య, రామన్‌పాడ్

✔ లీటరు నీటికి ఎసిఫేట్+ఇమిడాక్లోఫిడ్ 1.5 గ్రాములు లేదా కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 2 గ్రాములు లేదా కోరాంట్రీనిఫోల్ 0.3 మి.లీ లేదా టెట్రానిఫోల్ 0.5 మి.లీ కలిపి పిచికారీ చేయాలి.

? వేరుసెనగలో కుళ్లు నివారణకు చర్యలు తెలపండి.

- రాఘవేందర్, దుప్పల్లి

✔ లీటరు నీటిలో కార్బండిజియం+మ్యాంకోజోబ్ 2.5 గ్రాములు లేదా టెబ్యూకోనోజోల్ 1 మి.లీ కలిపి మొక్కల మొదళ్లు తడిచేటట్లు పిచికారీ చేయాలి.

? మిరపలో కింద ముడత (నల్లి) నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోవాలి?

- శేఖర్, మదనాపురం

✔ నల్లి ఉద్ధృతి బట్టి ఎకరానికి పెగాసస్ 300 గ్రాములు లేదా క్లోరోఫెనాపైర్ 400 మి.లీ లేదా జోలోన్ 400 మి.లీ మందును 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

- న్యూస్‌టుడే, మదనాపురం




- డాక్టర్ రాజేందర్‌రెడ్డి, కీటక శాస్త్రవేత్త, కేవీకే మదనాపురం

పత్తి లోడు వాహనం బోల్తా

ఇద్దరు హమాలీల దుర్మరణం

కర్నూలు గ్రామీణ, నేరవిభాగం న్యూస్‌టుడే : కర్నూలు గ్రామీణ మండలం ఆర్.కొంతలపాడు వాగు వద్ద సోమవారం పత్తి లోడు వాహనం బోల్తాపడిన ఘటనలో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. తెలంగాణ రాష్ట్రం గద్వాల జిల్లా వడ్డేపల్లి మండలం తిమ్మాజీపల్లె గ్రామానికి చెందిన జ్ఞానవంతుడు (28), జమ్మన్న (40)తోపాటు మరో నలుగురు పత్తి వ్యాపారుల వద్ద హమాలీలుగా పని చేస్తున్నారు. కర్నూలు జిల్లా కోడుమూరు పరిధిలో బొలెరో వాహనంలో పత్తి లోడు చేసుకుని శాంతినగర్‌కు బయలుదేరారు. కర్నూలు గ్రామీణ మండలం ఆర్.కొంతలపాడు వాగులో నుంచి వాహనం పైకి ఎక్కే క్రమంలో అదుపు తప్పి బోల్తా పడింది. వాహనంపైన కూర్చోవడంతో వాహనం మీద పడి జ్ఞానవంతుడు, జమ్మన్న అక్కడికక్కడే మృతి చెందారు. శ్రీకాంత్, పరశురాముడు, సురేష్, నర్సింహులు గాయపడగా వారిని కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదం జరిగిన వెంటనే డ్రైవర్ పరారయ్యాడు. జ్ఞానవంతుడికి మూడేళ్ల కిందట వివాహమైంది. జమ్మన్నకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. సమాచారం అందుకున్న అలంపూర్ ఎమ్మెల్యే విజేయుడు కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చి బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. కర్నూలు తాలూకా అర్బన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.





జ్ఞానవంతుడు, జమ్మన్న

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్ - లిస్టులో ఉంచే మరియు / లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

శ్రీలక్ష్మి నీ మహిమలూ.. చిత్రమై తోచునమ్మా!

పాలమూరు పురపాలకం, న్యూస్‌టుడే : శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం మహబూబ్‌నగర్ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో మెప్మా ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, పురపాలిక ఛైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ దంపతులు, పుర కమిషనర్, కౌన్సిలర్లు, కుటుంబ సభ్యులు హాజరయ్యారు. మైదానంలో బతుకమ్మలకు భక్తిశ్రద్ధలతో పూజలు చేసి వాటి చుట్టూ తిరుగుతూ ఆడిపాడారు. ఎమ్మెల్యే సతీమణి లక్ష్మీప్రసన్న, మార్కెట్ ఛైర్‌పర్సన్ అనిత, మహిళా కౌన్సిలర్లు మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు.

పాతబస్టాండ్(నారాయణపేట) : నారాయణపేట బారంబావి రాంలీల మైదానంలో సోమవారం బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే డా.పర్ణికరెడ్డి, జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్, శిక్షణ కలెక్టర్ గరీమ నరుల అతిథులుగా హాజరై బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్నారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ గందె అనసూయ, కౌన్సిలర్లు సరిత, వరలక్ష్మి, నారాయణమ్మ పాల్గొన్నారు.



మహబూబ్‌నగర్: బతుకమ్మ ఆడుతున్న మహిళలు



మహబూబ్‌నగర్: సతీమణితో కలిసి వేడుకకు హాజరైన ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, చిత్రంలో పుర ఛైర్‌పర్సన్ ఆనంద్‌గౌడ్, కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి, నాయకులు



పేట : బారంబావి దగ్గర బతుకమ్మ ఆడుతున్న పేట ఎమ్మెల్యే పర్ణిక రెడ్డి, కలెక్టరు సిక్తా పట్నాయక్, ట్రైనీ కలెక్టరు గరిమ నరుల, మున్సిపల్ ఛైర్‌పర్సన్ అనసూయ, కౌన్సిలర్లు



మహబూబ్‌నగర్: భారీ బతుకమ్మతో స్వీయచిత్రం దిగుతున్న యువతి





నారాయణపేట: బారంబావి దగ్గర కోలాహలం



నారాయణపేట: భారీ బతుకమ్మ వద్ద మహిళల ఆటపాటలు



మహబూబ్‌నగర్: అమ్మవారి రూపాన్ని అలంకరించిన బతుకమ్మతో మహిళ

నీట మునిగి విద్యార్థి మృతి



తరుణ్

మదనాపురం, న్యూస్‌టుడే: నీట మునిగి ఓ విద్యార్థి మృతిచెందిన సంఘటన మండలంలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. కొత్తకోట మండలంలోని రాయినిపేటకు చెందిన సత్యం, జానకమ్మ దంపతుల కుమారుడు తరుణ్(12) దసరా సెలవులు కావడంతో అమ్మమ్మ ఊరైన మదనాపురం మండలంలోని నెల్విడికి ఆదివారం మధ్యాహ్నం వచ్చాడు. సోమవారం కొంత మంది స్నేహితులతో కలిసి గ్రామ శివారులో ఉన్న ఊకచెట్టు వాగు వద్దకి ఈతకు వెళ్లాడు. తరుణ్ ఒడ్డు పై నిలబడి ఉండటంతో కాలు జారీ ప్రమాదవశాత్తు వాగులో పడి నీట మునిగాడు. పక్కనే ఉన్న ఓ విద్యార్థి గమనించి తరుణ్‌ను రక్షించే ప్రయత్నం చేయగా.. మరి కొంత మంది విద్యార్థులు వాగు సమీపంలోని పొలాల్లో ఉన్న రైతుల వద్దకి వెళ్లి జరిగిన విషయం చెప్పారు. వెంటనే వారు వాగు వద్దకి వచ్చి తరుణ్‌ను బయటకు తీశారు. అప్పటికే తరుణ్ మృతి చెందారు.

విద్యుదాఘాతంతో నెలల బాలుడు..

లింగాల, న్యూస్‌టుడే : విద్యుదాఘాతంతో చిన్నారి బాలుడు మృతి చెందిన సంఘటన లింగాలలో సోమవారం సాయంత్రం చోటు చేసుకొంది. కుటుంబ సభ్యులు కథనం ప్రకారం.. తల్లి శిరీష, తండ్రి రామావత్ అశోక్ మొదటి సంతానం అభిరామ్ 11 నెలలు. సోమవారం సాయంత్రం తల్లిదండ్రులు ఇంటి బయట పనులు మీద ఉన్నారు. అభిరామ్ ఇంట్లోని పడక గదిలో ఆడుకుంటూ స్విచ్ఛ్ బోర్డుకు ఉన్న ప్లగ్ సాకెట్ రంధ్రాల్లో చేతి వేలును దూర్చటంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. అపస్మారక స్థితిలో ఉన్న బాలుడిని ఆసుపత్రికి తరలిస్తుండగా.. మార్గమధ్యలో మృతి చెందాడు. తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి.

కార్లు ఢీకొని పది మందికి గాయాలు



ప్రమాదంలో గాయపడిన వారు


మహబూబ్‌నగర్ నేరవిభాగం, ఉట్కూర్ న్యూస్‌టుడే : ఎదురెదురుగా రెండు కార్లు ఢీకొనడంతో ముగ్గురికి తీవ్ర గాయాలు, ఏడుగురికి స్వల్ప గాయాలైన ఘటన మహబూబ్‌నగర్ జిల్లా కేంద్ర సమీపంలో చోటు చేసుకుంది. గ్రామీణ ఠాణా ఎస్సై విజయ్‌కుమార్ కథనం ప్రకారం.. నారాయణపేట మండలం అప్పిరెడ్డిపల్లికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు శంకర్ కుటుంబ సభ్యులతో కలిసి ఈ నెల 5న కారులో తిరుపతికి వెళ్లారు. సోమవారం దర్శనం పూర్తయిన తర్వాత అక్కడ నుంచి ఉదయం 6 గంటలకు తిరుగుపయనమయ్యారు. మార్గం మధ్యలోని మహబూబ్‌నగర్ మండలం ఓబ్లాయిపల్లి సమీపంలోని జాతీయ రహదారి-167 పై వారు ప్రయాణిస్తున్న కారు దేవరకద్ర నుంచి వస్తున్న మరో కారు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రమాదంలో 10 మంది గాయపడ్డారు. అప్పిరెడ్డిపల్లికి చెందిన శంకర్, అతడి భార్య అనురాధ, మూడేళ్ల కుమారుడు మాన్విక్‌రెడ్డి, కుటుంబ సభ్యులు చెన్నారెడ్డి, నర్సింహులు, అనంతమ్మ, డ్రైవర్ ప్రభాకర్‌రెడ్డి గాయపడ్డారు. అనురాధ, అనంతమ్మల తల, కాళ్లకు తీవ్రమైన గాయాలయ్యాయి. చిన్నారి కాలుకు దెబ్బ తగిలింది. మరో కారులో ఉన్న మచిలీపట్నంకు చెందిన ఫాస్టర్ తిమోతీ, పీటర్‌పాల్, నిర్మలకుమారి తదితరులు ఉట్కూర్‌లో నిర్వహించిన ఆధ్యాత్మిక కార్యక్రమం ముగించుకుని హైదరాబాద్‌కు వెళ్తున్నారు. ఈ ప్రమాదంలో వారికి స్వల్ప గాయాలయ్యాయి. వారు ప్రయాణిస్తున్న కారు బెలూన్స్ తెరచుకోవడంతో ప్రాణాపాయం తప్పింది. ప్రమాదం జరిగిన వెంటనే గ్రామీణ ఠాణా పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. గాయపడిన వారందరిని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, ఎస్వీఎస్ ఆసుపత్రులకు తరలించి చికిత్సలు అందిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	114–00
రిటైల్	136–00
డ్రెస్డ్	197–00
స్కిన్‌లెస్	224–00

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి దుర్మరణం

బాలాపూర్, న్యూస్‌టుడే: ఒకరు విధులకు హాజరయ్యేందుకు వెళ్తుండగా. . మరొకరు విధులు ముగించుకుని ఇంటికి వెళుతూ.. ఇద్దరూ అనుకోకుండా కలుసుకుని బయలుదేరిన 5 నిమిషాల వ్యవధిలోనే మృత్యువాతపడ్డారు. లారీ ఢీకొని ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. ఈ సంఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ కె.నాగరాజు కథనం ప్రకారం.. విశాఖపట్టణానికి చెందిన షేక్ మదీనా బాషా(42).. భార్య, ఇద్దరు పిల్లలతో మీర్‌పేట టీకేఆర్ కళాశాల సమీపంలోని ఓ అపార్టుమెంట్‌లో ఉంటున్నారు. ఆయన ఉప్పల్ ఫిర్జాదిగూడలోని టీజీఆర్టీసీ జోనల్ వర్క్‌షాప్‌లో అసిస్టెంట్ మెకానికల్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నారు. మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలం దర్పల్లికి చెందిన అన్నోజు శ్రావణ్‌కుమార్(40) నందనవనం ప్రాంతంలో భార్య, ఇద్దరు పిల్లలతో జీవనం సాగిస్తున్నారు. ఆయన టీకేఆర్ కళాశాలలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నారు. సోమవారం ఉదయం 7 గంటల అనంతరం బాషా తన బైక్‌పై విధులకు హాజరయ్యేందుకు వెళ్తున్నాడు. శ్రావణ్ ఆదివారం రాత్రి విధులకు హాజరై ఉదయం డ్యూటీ దిగి సుమారు 2 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఇంటికి వెళ్లేందుకు రహదారిపై వేచిఉన్నాడు. బాషా ద్విచక్రవాహనంపై వెళ్తుండగా శ్రావణ్ కుమార్ లిఫ్ట్ అడిగి ఎక్కాడు. కొద్ది దూరం వెళ్లగానే వెనుక నుంచి వచ్చిన లారీ.. ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న మీర్‌పేట పోలీసులు.. రెండు మృతదేహాలను ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



షేక్ మదీనా భాషా, శ్రావణ్‌కుమార్

సమస్య: పట్టణంలో కొత్త బస్టాండ్ వెనుక కె.లక్ష్మారెడ్డి కాలనీలో ఇళ్ల నిర్మాణాలు చేసుకున్న వారికి మురుగు కాల్వలు, సీసీ రహదారుల లేవు. డ్రైడేలో పరిసరాల పారిశుద్ధ్య పనులు చేపట్టిన మురుగు నిల్వతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. - **నర్సింహులుగౌడ్, అమరచింత**

సమాధానం: లక్ష్మారెడ్డి కాలనీలో సీసీ, మురుగు కాల్వలు, రహదారుల నిర్మాణానికి నిధులు మంజూరు కావాల్సి ఉంది. మురుగు రహదారులపై వదలకుండా ఇంకుడు గుంతలు నిర్మించేలా ఇంటి యజమానులకు అవగాహన కల్పిస్తాం. - **నూరుల్ నజీబ్, కమిషనర్**
– న్యూస్‌టుడే, అమరచింత

తెరపై ఈనాడు

శ్రీనివాస: **దేవర**, వెంకటేశ్వర: **రామ్‌నగర్‌బన్నీ**
శ్రీరామ: **శ్వాగ్** –న్యూస్‌టుడే, వనపర్తి న్యూటౌన్

అంగన్‌వాడీల ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు



బతుకమ్మలను తలలపై ఎత్తుకున్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు,టీచర్లు

గోపాల్‌పేట, న్యూస్‌టుడే: మండల కేంద్రమైన గోపాల్‌పేటలోని కోదండరామస్వామి ఆలయంలో సోమవారం బతుకమ్మ ఉత్సవాలను నిర్వహించారు. మండల పరిధిలోని అన్ని గ్రామాలకు చెందిన అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు ఉత్సవాల్లో పాల్గొన్నారు. గోపాల్‌పేట, రేవల్లి మండలాల సూపర్‌వైజర్లు, సీడీపీవో తదితరులు బతుకమ్మలను తలలపై ఎత్తుకున్నారు. పూలతో అలంకరించిన బతుకమ్మల చుట్టూ బొడ్డెమ్మలు ఆడారు.

నవరాత్రి ఉత్సవం.. అమ్మవారి వైభవం



ఆత్మకూరు: పార్వతీదేవి అలంకరణలో..



కేతేపల్లిలో..



కడుకుంట్ల అమ్మవారి ఆలయంలో..



వనపర్తి పట్టణం రాంనగర్‌కాలనీలో..



నాగవరం కండక్టర్‌కాలనీలో..



చిన్న చౌడేశ్వరీ ఆలయంలో..



అమరచింత: శివాజీనగర్‌లో లలితా త్రిపుర సుందరిదేవిగా

శక్తి స్వరూపిణి దుర్గమ్మ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు సోమవారం వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చింది. జిల్లా వ్యాప్తంగా పలు ఆలయాలు, ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మండపాల్లో మహిళలు పెద్ద ఎత్తున్న కుంకుమార్చనలు చేశారు. మండపాల వద్ద చిన్నారులు భక్తి పాటలకు నృత్యాలు ఆకట్టుకున్నాయి. వనపర్తి పట్టణంలోని పలు వార్డుల్లోని మండపాల్లో అమ్మవారిని ఎమ్మెల్యే మేఘారెడ్డి దర్శించుకుని పూజలు చేశారు. కొత్తకోట పట్టణంలోని అంబా భవాని శంకరాలయంలో అమ్మవారిని రూ.3 లక్షల 33వేల 333తో శ్రీ మహాలక్ష్మీదేవిగా అలంకరించారు. పెబ్బేరు పట్టణంలోని చౌడేశ్వరీ దేవి ఆలయంలో నిర్వహించిన పూజా కార్యక్రమంలో మార్కెట్ కమిటీ అధ్యక్షురాలు ప్రమోదినిరెడ్డి, ఉపాధ్యక్షుడు విజయవర్ధన్‌రెడ్డిలను తొగుట వీర క్షత్రియ సంఘం సభ్యులు సన్మానించారు. పలు ఆలయాల్లో భక్తుల సందడి నెలకొంది. **- న్యూస్‌టుడే బృందం**



ఖిల్లాగణపురంలో మహాచండీగా అమ్మవారు



పూజల్లో పాల్గొన్న మాజీ జడ్పీ ఛైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి



కొత్తకోట: అంబా భవాని శంకరాలయంలో..



గోపాల్‌పేటలో..



కొత్తకోట: కానాయపల్లి కోటిలింగేశ్వరస్వామి ఆలయంలో

సర్వే వివరాలు పక్కాగా నమోదు చేయండి: కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్‌సురభి, చిత్రంలో అదనపు కలెక్టర్ సంచిత్‌గంగ్వార్

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే: తెలంగాణ కుటుంబ సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో పక్కాగా నమోదు చేయాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో కుటుంబ సర్వే బృంద సభ్యులతో సమావేశం నిర్వహించారు. సర్వే వివరాల అడిగి తెలుసుకున్నారు. పైలట్ ప్రాజెక్టుగా వనపర్తి పురపాలికలోని పదో వార్డులో 771 కుటుంబాలు, మండలంలోని అంజనగిరి గ్రామంలో 223 కుటుంబాల సర్వే పూర్తి చేశామని బృంద సభ్యులు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో కుటుంబ వివరాలతో పాటు ఫొటోలు ఎవరికి వారివి జాగ్రత్తగా నమోదు చేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సంచిత్‌గంగ్వార్, పుర కమిషనర్ పూర్ణచందర్, తహసీల్దార్ రమేశ్‌రెడ్డి, ఎంపీడీవో రాఘవ, ఎంపీవో సుదర్శన్, టీపీవో కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రహదారి పనులకు భూమి పూజ

అమరచింత, న్యూస్‌టుడే: పట్టణ శివారు దుంపాయికుంట వద్ద శ్రీ జమ్ములమ్మ దేవత ఆలయానికి భక్తులు వెళ్లడానికి రూ.15 లక్షల సీసీ రహదారి పనులను పుర ఛైర్‌పర్సన్ వి.మంగమ్మ సోమవారం భూమి పూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. భక్తుల వినతితో మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి గతేడాది సీడీఎఫ్ నిధులు సీసీ రహదారి కోసం మంజూరు చేశారన్నారు. సాంకేతిక కారణాలతో పనులు ఆలస్యంగా ప్రారంభించిన నాణ్యతగా పనులు చేయాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రాజ్‌కుమార్, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ రాజు, మాజీ వైస్ ఛైర్మన్ నాగభూషణంగౌడ్, భారాస నాయకులు రమేశ్, రవి పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజస్తంభం ప్రతిష్ఠ



ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

గోపాల్‌పేట, న్యూస్‌టుడే: మండల పరిధిలోని లక్ష్మీదేవమ్మపల్లి గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయం ముందు వైభవంగా ధ్వజస్తంభం ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు. సోమవారం ఉదయం రాతితో తయారు చేయించిన ధ్వజస్తంభాన్ని పండితుల మంత్రోచ్ఛారణల మధ్య ప్రతిష్ఠించారు. మాజీమంత్రి నిరంజన్‌రెడ్డి ప్రత్యేక కార్యక్రమానికి హాజరై, గుడిలో పూజలు నిర్వహించారు. కార్యక్రమానికి పలు పార్టీల నాయకులు హాజరయ్యారు.

నందిమల్లలో అన్నమయ్య సంకీర్తనలు

అమరచింత: మండలంలోని నందిమల్ల గ్రామంలో దేవినవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దుర్గామాత ఆలయంలో టీటీడీ దేవస్థానానికి చెందిన శివయ్య, రమేశ్ కళాకారులతో సోమవారం రాత్రి ప్రత్యేక పూజలు చేశారు. అన్నమయ్య కీర్తనలు వినిపించారు. కార్యక్రమంలో నిర్వాహకులు వెంకటేశ్వర్‌రెడ్డి, హనుమాన్, బాలరాజు, పరుశరాం, భాస్కర్ పాల్గొన్నారు.

బాధితులకు చరవాణులు అప్పగింత

అమరచింత, న్యూస్‌టుడే: మండలంలో వివిధ సందర్భాల్లో చరవాణులు పోగొట్టుకున్న బాధితులకు సోమవారం ఠాణాలో ఎస్సై ఎం.సురేశ్ చరవాణులు అప్పగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలీసు శాఖ తీసుకొచ్చిన యాప్‌తో తప్పిపోయిన చరవాణులు స్వాధీనం చేసుకునే అవకాశం ఉందన్నారు. కావున బాధితులు చరవాణి కొనుగోలు చేసినపుడు ఇచ్చిన రసీదు, డబ్బా, ఐఎంఈఐ నంబరు సమాచారం జాగ్రత్తగా ఉంచుకోవాలని కోరారు. చరవాణి తప్పిపోతే వెంటనే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

మట్టి తొలగింపునకు చర్యలు

పాన్‌గల్, న్యూస్‌టుడే: మండలంలోని రాయినిపల్లి శివారులోని భీమా 27 ప్యాకేజీ డిస్ట్రిబ్యూటరీ 18 కాల్వలో నీరు ముందుకు వెళ్లకుండా మట్టిని అడ్డువేశారు. దీంతో సోమవారం భీమా డీఈ కిరణ్, ఎస్సై శ్రీనివాసులు ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. రైతులతో, గ్రామస్థులతో చర్చించారు. కాల్వలో మట్టి వేయడానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కాల్వలో అడ్డంగా ఉన్న మట్టిని తొలగింపునకు చర్యలు తీసుకొని నీరు ముందుకు సాగేలా చేశారు.

దసరా ఉత్సవాలకు రూ.41 వేలు వితరణ

ఖిల్లాగణపురం, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని కుమ్మరిగేరి ఆంజనేయస్వామి ఆలయంలోని ఆలయ కమిటీ సభ్యులకు దసరా ఉత్సవాల్లో భాగంగా రావణ దహనం నిర్వహణకు సింగిల్ విండో ఉపాధ్యక్షుడు క్యామరాజు రూ.41 వేలు వితరణంగా అందజేశారు. దసరా ఉత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు తన వంతు సహకారం అందజేసినట్లు తెలిపారు. మాజీ ఎంపీపీ క్యామ వెంకటయ్య, సింగిల్‌విండో డైరెక్టర్ కృష్ణయ్యగౌడ్, విక్రమ్, విజయ్‌కుమార్, గంజాయి రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

భాజపా సభ్యత్వ నమోదు

ఖిల్లాగణపురం, న్యూస్‌టుడే: గడిచిన పదేళ్లలో దేశంలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తూ ప్రధాని మోదీ ప్రపంచానికే ఆదర్శంగా నిలుస్తున్నారని భాజపా జిల్లా భాజపా ఉపాధ్యక్షుడు సీతారాములు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో మండలాధ్యక్షుడు బుచ్చిబాబు గౌడ్, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ ఆధ్వర్యంలో భాజపా సభ్యత్వ నమోదు నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ కాలనీల్లో ప్రజలతో సభ్యత్వ నమోదును చేయించారు. జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆశన్న, మాజీ ప్రధాన కార్యదర్శి శివశంకర్, నాయకులు వెంకటేశ్, విజయ్ పాల్గొన్నారు.

వీధి దీపాలు ఏర్పాటు చేయాలని వినతి

వనపర్తి పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని 30వ వార్డులో వీధి దీపాలు ఏర్పాటు చేయాలని స్థానిక కౌన్సిలర్ వాకిటి శ్రీధర్ కాలనీ వాసులు అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్‌కు వినతిపత్రం అందించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో కాలనీ వాసులతో వాకిటి శ్రీధర్ వినతిపత్రం ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వీధి దీపాలు లేకపోవడంతో పాములు, కుక్కల బెడద ఎక్కువైందన్నారు. కార్యక్రమంలో కాలనీ వాసులు జానయ్య, కృష్ణా నాయక్, అజీమ్ భాషా, రాజవర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచండి

పాన్‌గల్, న్యూస్‌టుడే: దోమలు కుట్టకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని, అదే విధంగా పరిసరాలు శుభ్రంగా ఉంచాలని పాన్‌గల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డా. చంద్రశేఖర్ అన్నారు. సోమవారం మండలంలోని రాయినిపల్లి గ్రామంలో వైద్య సిబ్బంది పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో పలు కుటుంబాల నుంచి రక్తనమూనా సేకరించారు. ప్రజలకు సీజనల్ వ్యాధులు, దోమలు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.డాక్టర్లు నిహారిక, సీహెచ్‌వో రామయ్య, సిబ్బంది రాంచందర్, మదన్‌గోపాల్, కళావతి, సతీష్, మధుబాబు, తిరుపతయ్య, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆశ కార్యకర్తలతో రక్తపరీక్షలు చేయించడం సరికాదు



వనపర్తి కలెక్టరేట్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఆశ కార్యకర్తలు, సీఐటీయూ నాయకులు

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే: ఆశ కార్యకర్తలతో రక్తపోటు, మధుమేహం పరీక్షలు చేయించడం సరికాదని, శిక్షణ పొందిన ల్యాబ్ టెక్నీషియన్లతో చేయించాలని ఆశ కార్యకర్తల యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు జయలక్ష్మి అన్నారు. సోమవారం ఆశ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ), వనపర్తి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రక్త పరీక్షలను రాష్ట్రంలో ఎక్కడ కూడా ఆశ కార్యకర్తలతో చేయించడం లేదన్నారు. ఆశ కార్యకర్తలు చేయాల్సిన పనిని పక్కన పెట్టి పని భారం పెంచి వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. పనికి తగ్గ వేతనం రూ.18వేలు ఇవ్వాలన్నారు. అనంతరం వివిధ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సంఘం నాయకులతో కలిసి కలెక్టర్ ఆదర్శ్‌సురభికి అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ, ఆశ కార్యకర్తల సంఘం నాయకురాలు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యం

పెద్దమందడి, (వనపర్తి న్యూటౌన్), న్యూస్‌టుడే: ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యమని ఎమ్మెల్యే మేఘారెడ్డి అన్నారు. సోమవారం పెద్దమందడి మండలం వెల్టూరు గ్రామంలో మహాలక్ష్మి పథకం రాయితీ సిలిండర్ ధ్రువపత్రాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పదేళ్ల భారాస పాలనలో రాష్ట్రాన్ని అప్పులకు పుప్పిగా మార్చి దివాలా తీయించారన్నారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, రూ.10లక్షలతో ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యం, రైతులకు రుణమాఫీ చేసి ప్రభుత్వం అండగా ఉందన్నారు. దసరా నుంచి ప్రతి అర్హుడికి ఖాతాలో రైతు భరోసా డబ్బులు జమ చేస్తామన్నారు. మార్కెట్ యార్డు ఉపాధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ రఘుప్రసాద్, మాజీ సర్పంచి శ్రీనివాస్‌రెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.



ముందరితండాలో బతుకమ్మ ఊరేగింపులో పాల్గొన్న ఎమ్మెల్యే మేఘారెడ్డి

పెద్దమందడి, (వనపర్తి న్యూటౌన్): క్రీడలు దేహదారుఢ్యానికి, మానసికోల్లాసానికి ఎంతో ఉపయోగపడతాయని ఎమ్మెల్యే అన్నారు. వెల్టూరు గ్రామంలో నిర్వహించిన గ్రామస్థాయి క్రికెట్ పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించారు. క్రీడా పోటీల ద్వారా యువకుల మధ్య ఐక్యత ఏర్పడుతుందన్నారు. పలువురు క్రీడాకారులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

పెద్దమందడి, (వనపర్తి న్యూటౌన్): మండలంలోని ముందరితండాలో పంచాయతీ భవనాన్ని, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. తండా అభివృద్ధికి ఎల్లవేళలా సహకరిస్తామన్నారు. అనంతరం మహిళలు బతుకమ్మతో ఊరేగింపు నిర్వహించి తండా వాసులు నృత్యాలు చేశారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

కొత్తకోట గ్రామీణం: కొత్తకోట పట్టణానికి చెందిన సామాజిక కార్యకర్త ఎస్‌ఆర్ ప్రేమయ్య మూడు రోజుల క్రితం మృతి చెందగా సోమవారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి బాధిత కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే మేఘారెడ్డి పరామర్శించారు. మార్కెట్ కమిటీ అధ్యక్షుడు ప్రశాంత్, నాయకులు యుగంధర్‌గౌడ్, వెంకటయ్య, మిషేక్, ప్రేమదానం పాల్గొన్నారు.

తాగునీటి పథకాల మరమ్మతులపై శిక్షణ



మాట్లాడుతున్న మిషన్ భగీరథ డీఈఈ జైపాల్ రెడ్డి

మదనాపురం, న్యూస్‌టుడే: మండల ప్రజా పరిషత్తు కార్యాలయంలో సోమవారం 17 పంచాయతీల పరిధిలోని మల్టీ పర్పస్ సిబ్బంది, తాగు నీటి సిబ్బందికి నాలుగు రోజుల పాటు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు మిషన్ భగీరథ ఏఈఈ శివానంద్ తెలిపారు. ఈ సందర్భంగా మిషన్ భగీరథ డీఈఈ జైపాల్ రెడ్డి మాట్లాడుతూ.. క్షేత్ర స్థాయిలో తాగునీటి పథకం, నీటి సరఫరా నిర్వహణలో ఎదురయ్యే సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కారానికి సిబ్బంది చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం మొదటి రోజు సిబ్బందికి పైపులైన్ల మరమ్మతులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ అబ్రహం లింకన్, ఎంపీడీవో ప్రసన్నకుమారి, ఎంపీవో ఉషన్న, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వీపనగండ్ల(చిన్నంబావి): గ్రామాల్లో తాగునీటి పథకం పనుల్లో ఎదురయ్యే సమస్యలను సత్వరంగా పరిష్కరించడానికి గ్రామ పంచాయతీలలో పనిచేస్తున్న కార్మికులకు శిక్షణ ఇస్తున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ వెంకటరమణ అన్నారు. సోమవారం ఉమ్మడి వీపనగండ్ల, చిన్నంబావి మండలాల్లోని పంచాయతీలలో పనిచేస్తున్న వారికి ఎంపీడీవో కార్యాలయంలో శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచి నీటి పథకం పనుల పై కార్మికులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించడానికి శిబిరాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈఈ మెగారెడ్డి, డీఈ అమిత్‌కుమార్, ఎంపీడీవో శ్రీనివాసరావు, ఏఈఈలు ఉదయ్‌కుమార్, రవితేజ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాల ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలి



తహసీల్దార్ చాంద్‌పాషకు వినతిపత్రం సమర్పిస్తున్న సీపీఐ నాయకులు

ఆత్మకూరు, న్యూస్‌టుడే: ఆత్మకూరు పురపాలికతో పాటు మండలం పరిధిలోని గ్రామాల్లో ప్రభుత్వ స్థలాల ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని సీపీఐ మండల కార్యదర్శి రాబర్ట్ డిమాండ్ చేశారు. ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవడంతో పాటు గ్రామాల్లో నెలకొన్న ప్రధాన సమస్యల పరిష్కారం కోరుతూ సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఇళ్ల స్థలాల ధ్రువీకరణ పత్రాలు జారీ చేసిన వారికి ఇళ్ల స్థలాలను స్వాధీన పర్చాలని, రేచింతల, జూర్యాల గ్రామాల్లో శ్మశానవాటికలను ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం తహసీల్దార్ చాంద్‌పాషకు వినతిపత్రాన్ని సమర్పించారు. నాయకులు శ్రీహరి, మండల నాయకులు నర్సింహయ్యశెట్టి, బాలరాజు, బాలకృష్ణ, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేత

వనపర్తి న్యూటౌన్: సుమన శటోకాన్ కరాటే అకాడమీ అఫ్లికేటెడ్ గాడ్స్ ఆన్ వారియర్స్ చోటుఖాన్ కరాటే డు ఇండియా ఆధ్వర్యంలో కరాటే విద్యార్థులకు బెల్టుల గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించారు. సోమవారం ఎస్పీ కార్యాలయంలో యుద్ధవిద్యలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బెల్టులను ఎస్పీ గిరిధర్ చేతుల మీదుగా అందజేశారు. డీసీఆర్బీ డీఎస్పీ కృష్ణకిశోర్, ఆర్ఐ అప్పలనాయుడు, కొత్తకోట ఎస్సై మంజునాథ్ రెడ్డి, యుద్ధ శిక్షకుడు శ్రీను పాల్గొన్నారు.

ఎలక్షన్ విధుల ధ్రువపత్రాలు ఇవ్వాలని వినతి

వనపర్తి పట్టణం: 2024 లోక్‌సభ సాధారణ ఎన్నికల్లో విధుల నిర్వహించిన ఉపాధ్యాయులకు డ్యూటీ ధ్రువపత్రాలు ఇవ్వాలని జిల్లా పీఆర్టీయూ అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి మహబూబ్‌నగర్ కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ఎన్నికలు ప్రశాంతంగా ముగిసేందుకు ఉపాధ్యాయులు కృషి చేశారని పేర్కొన్నారు. తమ వినతిని పరిశీలించి వీలైనంత త్వరగా ఎన్నికల విధుల ధ్రువపత్రాలు జారీ చేయాలని కోరారు.

చిరుధాన్యాల ఆహారం ఆరోగ్యానికి మేలు



చిరుధాన్యాలతో వివిధ రకాల తయారీపై శిక్షణ ఇస్తున్న శాస్త్రవేత్త అనిత

మదనాపురం, న్యూస్‌టుడే: చిరుధాన్యాల విలువ ఆధారిత ఉత్పత్తులతో కుటీర పరిశ్రమ ఏర్పాటు చేసుకొని మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించవచ్చునని కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త రాజేందర్‌రెడ్డి, ఏడీఏ దామోదర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో మహిళలకు ఆరు రోజుల పాటు చిరుధాన్యాల ప్రాసెసింగ్, విలువ ఆధారిత ఉత్పత్తులు, మార్కెటింగ్‌పై నిర్వహించిన నైపుణ్య శిక్షణ కార్యక్రమంలో వారు మాట్లాడారు. చిరుధాన్యాల్లో ఖనిజ లవణాలు పుష్కలంగా ఉండి, ఆరోగ్యానికి మేలు చేస్తాయన్నారు. అనంతరం గృహ విజ్ఞాన శాస్త్రవేత్త అనిత చిరుధాన్యాలతో రాగి, జొన్న, బిస్కెట్స్, లడ్డూ తయారు చేసి మహిళలకు చూయించారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త భవాని, వివిధ గ్రామాలకు చెందిన మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

భూముల రిజిస్ట్రేషన్లు నిలుపుదలపై ధర్నా



ఏదులలో ధర్నా చేస్తున్న వివిధ గ్రామాల నాయకులు

ఏదుల (గోపాల్‌పేట): కొత్తగా ఏర్పడిన ఏదుల మండలంలో కోడేరు మండలం నుంచి వచ్చి కలిసిన గ్రామాల భూములకు వారం రోజులుగా రిజిస్ట్రేషన్లను నిలిపివేశారు. విషయం తెలుసుకున్న ముత్తిరెడ్డిపల్లి, సింగాయపల్లి, తుర్కదిన్నె, రేకులపల్లితండా, మాచుపల్లి తదితర గ్రామాలకు చెందిన నాయకులు ఇతర గ్రామాల నాయకులతో కలిసి సోమవారం రెవెన్యూ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అన్ని గ్రామాల భూముల రిజిస్ట్రేషన్లను కొనసాగించాలని, ఇతర ప్రభుత్వ కార్యాలయాలను ఏదులలో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మొదట వారు తహసీల్దార్ మల్లిఖార్జునకు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేస్తూ జిల్లా అధికారులను పిలిపించాలని కోరారు. తహసీల్దార్ విషయాన్ని ఆర్డీవో పద్మావతి దృష్టికి తీసుకెళ్లడంతో ఆమె ఏదుల గ్రామానికి చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడారు. వారి నుంచి డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని స్వీకరించారు. అక్కడి నుంచి కలెక్టర్‌తో ఆమె ఫోన్‌లో మాట్లాడి సమస్యను వివరించారు. దీంతో స్పందించిన కలెక్టర్ రేపటి నుంచి భూముల రిజిస్ట్రేషన్లను కొనసాగిస్తామని హామీనిచ్చినట్లు ఆందోళనకారులు తెలిపారు.

చారిత్రక వైభవం చాటే విగ్రహాలు



రాతిపై ఉన్న విగ్రహాలను పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు, కొత్త తెలంగాణ చరిత్ర బృందం సభ్యులు

కొత్తకోట గ్రామీణం, న్యూస్‌టుడే: కొత్తకోట సమీపంలోని పాలెం వాగులో ఆదివారం లభ్యమైన రాతి విగ్రహాలను సోమవారం రెవెన్యూ అధికారులు, కొత్త తెలంగాణ చరిత్ర బృందం సభ్యులు పరిశీలించారు. ఈ సందర్భంగా బృందం సభ్యులు భైరవ చంద్రశేఖర్, బైరోజ్ శ్యాంసుందర్ మాట్లాడుతూ.. ఇవి 1300 ఏళ్ల నాటి విగ్రహాలన్నారు. రాతిపై చెక్కిల చిత్రాలను వీరగల్లు అంటారన్నారు. ఈ ప్రాంతంలో జరిగిన యుద్ధంలో మృతిచెందిన వీరుల స్మృతి చిహ్నంగా రాతి బండలపై చిత్రాలను చెక్కి భద్రపరుస్తారన్నారు. మరో రాయిపై ఉన్న లిపి కాకతీయుల కాలం నాటిందన్నారు. దానిపై ఉన్న వివరాలను పరిశీలించగా ఏదైనా దానపూర్వకరంగా ఇస్తే సూర్య, చంద్రులు ఉన్నంత కాలం అది గుర్తుకు ఉండేలా రాతిపై రాసినట్లు వారు తెలిపారు. శైవమతం ఆచారం ప్రకారం శివ లింగం ఆకారాన్ని చెక్కినట్లు వారు వివరించారు. తహసీల్దార్ వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు ఆర్ఐ వాసు, సర్వేయర్ నవీన్‌కుమార్ రెడ్డి వాగులో ఉన్న విగ్రహాలను పరిశీలించారు.

చట్టాలపై అవగాహన సదస్సు

ఖిల్లాగణపురం: మండల పరిధిలోని ఉప్పరిపల్లి గ్రామంలో జిల్లా న్యాయసేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో గ్రామస్థులకు న్యాయ విజ్ఞాన సదస్సులో భాగంగా చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ అవగాహన సదస్సులో లీగల్ అండ్ డిఫెన్స్ కౌన్సిల్స్ ఉత్తరయ్య, శ్రీదేవి, ఏఎస్సై నాగరాజు పాల్గొని మాట్లాడారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు వాహనాలు ఇవ్వడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని ఎంతో భవిష్యత్తు ఉన్న యువతీ యువకులు ప్రమాదాల వల్ల దివ్యాంగులుగా మారి తమ భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. మత్తు పదార్థాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని తెలిపారు. న్యాయవాదులు యాదగిరి, ఆంజనేయులు, శ్రీనివాస్, విష్ణు, చక్రవర్ధన్ రెడ్డి, లోక్ అదాలత్ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

చెట్టును ఢీకొన్న కారు.. నలుగురికి గాయాలు

కొత్తకోట గ్రామీణం, న్యూస్‌టుడే: వనపర్తికి చెందిన రేవంత్ యాదవ్, జి.యశ్వంత్, రోహిత్‌యాద్, కే.యశ్వంత్‌లు సోమవారం కారులో కొత్తకోటకు వస్తుండగా గుంపు గట్టు వద్ద కారు అదుపు తప్పి రహదారి పక్కన ఉన్న భోజనశాలలోకి దూసుకెళ్లి చెట్టును ఢీ కొన్ని ఆగింది. ప్రమాదంలో నలుగురికి గాయాలు కావడంతో జిల్లా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై అస్రఫ్‌సుల్తాన్ తెలిపారు.

మృతదేహం అప్పగింత

అమరచింత, న్యూస్‌టుడే: మండలంలోని పామిరెడ్డిపల్లె, కొంకలవానిపల్లె గ్రామాల మధ్యలోని మరికల్ ప్రధాన రహదారిపై ఆదివారం సాయంత్రం గుర్తుతెలియని వాహనం ఢీకొని మృతిచెందిన శారద మృతదేహాన్ని సోమవారం పోస్టుమార్టం చేసి బంధువులకు అప్పగించినట్లు ఎస్సై బి.సురేశ్ తెలిపారు. మృతురాలి మామ వెంకటన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

గోపాల్‌పేట, న్యూస్‌టుడే: గోపాల్‌పేటకు చెందిన మండ్ల తిరుపతయ్య(56) ఈనెల 6న మధ్యాహ్నం పొలం వద్దకు వెళ్లి వస్తానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. ఆదివారం, సోమవారం పొలం వద్ద, చుట్టుపక్కల గ్రామాల్లో ఎక్కడ వెతికినా ఆచూకీ లభించలేదు. అతడి భార్య రామేశ్వరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై హరిప్రసాద్ తెలిపారు.

కులం పేరుతో దూషించిన వారిపై..

పాన్‌గల్, న్యూస్‌టుడే: కులం పేరుతో దూషించిన వ్యక్తి పై, అందుకు కారణమైన వ్యక్తిపై కేసు నమోదైన సంఘటన సోమవారం మండలంలో జరిగింది. ఎస్సై శ్రీనివాస్ యాదవ్ కథనం ప్రకారం.. పాన్‌గల్‌కు చెందిన ఆది తరుణ్ వనపర్తిలో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడన్నారు. అక్కడే పని చేస్తున్న మరో ఉద్యోగి జియంమహబూబ్‌తో పని విషయంలో ఈనెల 5న గొడవ చోటు చేసుకుంది. అదే రోజు రాత్రి తరుణ్‌గౌడ్ అనే వ్యక్తి తరుణ్‌కు ఫోన్ చేసి మహబూబ్‌తో ఎందుకు గొడవపడుతున్నావని అసభ్యకరంగా తిట్టి కులం పేరుతో దూషించాడు. నన్ను తిట్టిన, అందుకు కారణమైన ఇద్దరిపై కేసు నమోదు చేయాలని తరుణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

దాడి చేసిన వ్యక్తిపై..

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే: ఓ వ్యక్తిపై కేసు నమోదైన సంఘటన పెద్దమందడి మండల కేంద్రంలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్సై యుగంధర్‌రెడ్డి కథనం ప్రకారం.. ఈ నెల 6న రమేశ్ రాత్రి పది గంటలకు దుకాణాన్ని మూసివేశాడు. ఇదే గ్రామానికి చెందిన వెంకటేష్ దుకాణం వద్దకు వచ్చి తలుపు కొట్టాడు. ఎందుకు ఇలా చేస్తున్నావని అడగగా మద్యం ఇవ్వాలని వెంకటేశ్ అడగగా నేను అమ్మడం లేదని రమేశ్ చెప్పగా కర్రతో వెంకటేశ్ రమేశ్‌పై దాడి చేశాడు. మా ఆయన ఎందుకు కొడుతున్నావని రమేశ్ భార్య అడ్డుకోగా ఆమెపై దాడి చేశాడు. రమేశ్ ఫిర్యాదు మేరకు దాడికి కారణమైన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

జూద స్థావరంపై పోలీసులు దాడి

పెబ్బేరు, న్యూస్‌టుడే: జూద స్థావరంపై వనపర్తి సీసీఎస్ (సెంట్రల్ క్రైమ్ స్టేషన్) పోలీసులు సోమవారం సాయంత్రం దాడి చేశారు. పెబ్బేరు మండలంలోని రంగాపూర్ గ్రామ సమీపంలోని ఓ ప్రైవేటు గోదాంలో వివిధ ప్రాంతాలకు చెందిన 15 మంది జూదం ఆడుతుండగా సమాచారం తెలుసుకున్న వనపర్తి సీసీఎస్ సీఐ రవిపాల్, హెడ్ కానిస్టేబుల్ తిరుపతిరెడ్డి, పోలీసులు స్వామి, మురళి, సమరసింహరెడ్డిలు కలిసి దాడి చేశారు. జూదం ఆడుతున్న వారి నుంచి రూ.6.35 లక్షల నగదు, నాలుగు కార్లు, నాలుగు ద్విచక్రవాహనాలు, 15 చరవాణులు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ రవిపాల్ చెప్పారు. పట్టుబడిన వారిలో జోగులాంబ గద్వాల జిల్లా కొండేరు, పెబ్బేరు, రంగాపూర్ గ్రామానికి చెందిన వారే అధికంగా ఉన్నారు. అదుపులోకి తీసుకొన్న వారిని, స్వాధీనం చేసుకొన్న నగదు, వాహనాలను, చరవాణిలను స్థానిక పెబ్బేరు పోలీసులకు అప్పగించినట్లు సీఐ వివరించారు.

18 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

ఆత్మకూరు: సంజయ్‌కాలనీలో సోమవారం సాయంత్రం 18 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుబడ్డాయి. రాజు ఇంటి వద్ద రేషన్ బియ్యం నిల్వ చేసినట్లు వచ్చిన సమాచారం మేరకు పోలీసులు తనిఖీ నిర్వహించి, నిల్వ ఉంచిన బియ్యాన్ని స్వాధీనం చేసుకోని ఠాణాకు తరలించారు. రేషన్ బియ్యం పట్టివేత సమాచారం పౌరసరఫరా శాఖ సిబ్బందికి చేరవేశామని వారు ఇచ్చే ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయనున్నామని ఎస్సై వి.నరేందర్ తెలిపారు.